సాక్షి
యాదాద్రి భువనగిరి

సోమవారం ; 19 ; ఆగస్టు ; 2024



భవిష్యత్‌కు నవోదయం

2025-26 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశానికి జవహర్ నవోదయ నోటిఫికేషన్ విడులైంది. - 10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం	: 590 అడుగులు
ఇన్‌ఫ్లో	: 71,288 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 71,288 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29,110 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 8,067 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 6,791 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1800 క్యూసెక్కులు
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 645 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం: 642.50 అడుగులు	
ఇన్‌ఫ్లో	: 971 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 624.52 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 259.38 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 306.54 క్యూసెక్కులు
సీపేజీ, లీకేజీ ద్వారా	: 11.15 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

ఓటరు నమోదుకు మరో అవకాశం

భువనగిరి : స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధమవుతున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఓటరు నమోదుకు మళ్లీ అవకాశం కల్పించింది. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని స్పష్టం చేసింది. ఓటరుగా నమోదు కోసం తహసీల్దార్ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఫారం-6లో వివరాలు పొందుపరిచి అక్కడే సమర్పించాల్సి ఉంటుంది. అంతేకాకుండా బోగస్ ఓటర్ల ఏరివేతకు బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే చేపట్టనున్నారు. ఈ కార్యక్రమం ఈనెల 20 నుంచి ప్రారంభంకానుంది. అదే విధంగా మృతిచెందిన వ్యక్తులు, వలస వెళ్లిన వారి పేర్లను కూడా తొలగించనున్నారు.

బీజేపీ పాలనలో స్త్రీలపై దాడులు పెరిగాయి



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు మేడబోయిన మమత

భువనగిరిటౌన్ : కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలపై దాడులు పెరిగిపోయాయని, ధైర్యంగా బయటకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయని ఎస్‌ఎఫ్‌ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు మేడబోయిన మమత పేర్కొన్నారు. భువనగిరిలోని సుందరయ్య భవనంలో ఆదివారం నిర్వహించిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. యూనివర్సిటీల్లో ర్యాగింగ్‌ను అరికట్టడంలో కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయన్నారు.కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై లైంగికదాడికి పాల్పడి, హత్య చేసిన ఘటనపై కేంద్రం నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. సీబీఐతో విచారణ చేయించి నిందితున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు చింతల శివ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కుక్కట్ల శివాణి, జిల్లా కార్యదర్శి లావుడియ రాజు, ఉపాధ్యక్షులు వేముల నాగరాజు, కాసుల నరేష్, గంగాదేవి సాయి, సహాయ కార్యదర్శి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ పోలీస్ మెడల్ గ్రహీతకు సన్మానం



ఏఎస్‌ఐ కాట్రగడ్డ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

చౌటుప్పల్ : ఇండియన్ పోలీస్ మెడల్ సాధించిన చౌటుప్పల్ పట్టణ ట్రాఫిక్ ఏఎస్‌ఐ కాట్రగడ్డ శ్రీనివాస్‌ను ఆదివారం పలువురు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించి ఇప్పటికే ఎన్నో రివార్డులు, ప్రశంసా పత్రాలు పొందారని, ఇప్పుడు ఇండియన్ పోలీస్ మెడల్ రావడం గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బత్తుల శ్రీశైలం, బీజేపీ రాష్ట్ర నాయకుడు గుజ్జుల సురేందర్‌రెడ్డి, గ్రంథాలయ మాజీ చైర్మన్ ఊడుగు మల్లేష్, మాజీ ఎంపీటీసీ అన్నెమోని గోవిందరాజు, అమృతం వెంకటేశం, పోలోజు భాస్కరాచారి, తదితరులు పాల్గొన్నారు.

పంచనారసింహులకు నిత్యారాధనలు



స్వామివారికి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి క్షేత్రంలో కొలువై ఉన్న పంచనారసింహులకు ఆదివారం నిత్యారాధనలు కొనసాగాయి. అర్చకులు వేకువ జామున ప్రధానాలయాన్ని తెరిచి స్వయంభూలకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం నిజాభిషేకం, తులసీ అర్చన చేశారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు గావించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవను ఆలయంలో భక్తుల మధ్యన ఊరేగించారు. వేద ఆశీర్వచనం, సువర్ణ పుష్పార్చన, నిత్యకల్యాణంలో పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

సీటు దొరకడం గగనమే

ఉచిత ప్రయాణం, శ్రావణమాసం ఎఫెక్ట్.. కిటకిటలాడుతున్న ఆర్టీసీ బస్సులు



మహాలక్ష్మి పథకంతో ఇప్పటికే ఆర్టీసీ బస్సులు కిటకిటలాడుతుండగా, పది రోజులుగా ప్రయాణికుల తాకిడి మరింత పెరిగింది. శ్రావణమాసం నేపథ్యంలో ఏ బస్సు చూసినా జాతర వేళను తలపిస్తోంది. కూర్చోడానికి సీటు దొరకడమే గగనమైంది. కిక్కిరిసిన ప్రయాణికులతో కండక్టర్లకు టికెట్లు కొట్టడానికి కూడా కాలుమోపలేని పరిస్థితి నెలకొంది. ప్రయాణికుల్లో మూడొంతుల మంది మహిళలే ఉంటున్నారు.

- ఒక్కో బస్సులో వంద మందికి పైనే ప్రయాణం
- కండక్టర్లు టికెట్లు కొట్టడానికి కాలుమోపలేని పరిస్థితి
- రద్దీకి అనుగుణంగా బస్సులు నడపని ఆర్టీసీ అధికారులు
- పరిమితికి మించిన ప్రయాణంతో పొంచి ఉన్న ముప్పు

భువనగిరిటౌన్, యాదగిరిగుట్ట : జిల్లా పరిధిలో ఆర్టీసీ బస్సులు ప్రయాణికులతో కిక్కిరుస్తున్నాయి. మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించాక రద్దీ విపరీతమైంది. రోజువారీగా ప్రయాణించే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. దీనికి తోడు శ్రావణమాసంలో పండుగలు, శుభకార్యాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. ప్రజలు పుణ్యక్షేత్రాలు, విహార యాత్రలకు వెళ్తున్నారు. మరోవైపు ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవం, 16న వరలక్ష్మీ వ్రతం, 17, 18న వీకెండ్, 19న రాఖీపౌర్ణమి కావడంతో వరుస సెలవులు వచ్చాయి. దీంతో హైదరాబాద్ జంటనగరాలతో పాటు వివిధ ప్రాంతాల్లో ఉంటున్న జిల్లా ప్రజానీకం స్వస్థలాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో బస్సుల్లో రద్దీ విపరీతంగా పెరిగింది. బస్సులు, బస్టాండ్లలో ప్రధాన పండుగల సమయంలో మాదిరిగా రద్దీ కనిపిస్తోంది. పిల్లలు, వృద్ధులతో వెళ్లేవారు నానా అవస్థలు పడుతున్నారు. సీట్లు కోసం ప్రయాణికుల మధ్య తోపులాటలు, ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి.

ఆందోళన కలిగిస్తున్న ప్రయాణం

యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో పరిధిలో మొత్తం 103 బస్సులు సేవలందిస్తున్నాయి. ఇందులో ఎక్స్‌ప్రెస్‌లు 16, పల్లె వెలుగులు 36, మినీ పల్లె వెలుగులు 22, అద్దె బస్సులు 8, ప్రైవేట్ సర్వీసులు 21 ఉన్నాయి. ఇవన్నీ మహాలక్ష్మి పథకానికి ముందు 32వేల కిలో మీటర్ల మేర నడిచేవి. ప్రస్తుతం 36వేల కిలో మీటర్ల మేర తిరుగుతూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నాయి. కాగా రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో బస్సుల్లో విపరీతమైన రద్దీ పెరిగింది. ఒక్కో బస్సుల్లో గరిష్టంగా 50 మంది వరకు ప్రయాణించాల్సి ఉంటుంది. కానీ, 100 నుంచి 130 మంది వరకు ప్రయాణం సాగిస్తున్నారు. జిల్లా పెరిగిన ఆక్యుపెన్సీ ప్రకారం ఇంకా 10 బస్సులు కావాల్సి ఉంది. అసలే పాత బస్సులు కావడం.. సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఎక్కుతుండడంతో ఆర్టీసీ జర్నీ అంటేనే ఆందోళన కలిగిస్తోంది. మలుపుల వద్ద బస్సులు ఒక వైపు వంగుతుండడంతో ప్రయాణికులు జంకుతున్నారు. రద్దీకి అనుగుణంగా బస్సులు పెంచాలని కోరుతున్నారు.

చౌటుప్పల్ బస్టాండ్‌లో రద్దీ

చౌటుప్పల్ : హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం వాహనాలు బారులుదీరాయి. హైదరాబాద్ జంటనగరాలతో పాటు వివిధ ప్రాంతాల్లో ఉంటున్న ప్రజానీకం రాఖీపండుగకు సొంతూళ్లకు పయమనయ్యారు. ఈ నేపథ్యంలో హైవేపై రద్దీ ఏర్పడింది. అలాగే చౌటుప్పల్ బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసింది. బస్సులు ఎక్కేందుకు ప్రయాణికులు ఎగబడాల్సి వచ్చింది. కొన్ని ప్రాంతాలకు బస్సులు సకాలంలో రాక ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించారు.

మూడొంతులు మహిళలే..



చౌటుప్పల్‌లో బస్సు ఎక్కుతున్న మహిళా ప్రయాణికులు

మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడానికి ముందు యాదాద్రి జిల్లా పరిధిలో రోజూ 25 వేల నుంచి 30 వేల మంది ప్రయాణించేవారు. ఆ తరువాత 42 వేలకు పెరిగింది. శ్రావణమాసం నేపథ్యంలో 50వేల మంది వరకు ప్రయాణిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ప్రయాణికుల్లో మూడొంతుల మంది మహిళలే ఉంటున్నారు.



చౌటుప్పల్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం ప్రయాణికుల రద్దీ

బస్సు చార్జి లేకుండా వచ్చా..



మా కుటుంబం హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో నివాసం ఉంటుంది. మా సోదరులకు రాఖీలు కట్టడానికి ఆత్మకూర్(ఎం) మండలంలోని రాయిపల్లికి 15 ఏళ్లుగా ఆర్టీసీ బస్సుల్లోనే వచ్చిపోతుంటాను. అప్పుడు టికెట్ చార్జి ఉండేది. ఈసారి చార్జి లేకుండా రాయిపల్లికి వచ్చాను. ప్రభుత్వం ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ఆనందంగా ఉంది.

–కోలా నిఖిత, బోడుప్పల్

ఉపయోగకరంగా ఉంది



ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం ఉపయోగకరంగా ఉంది. ముఖ్యంగా సామాన్య, మధ్య తరగతి మహిళలకు ఎంతో సౌలభ్యంగా ఉంది. గతంలో ఏదైనా పనిమీద వేరే ఊర్లకు, బంధువుల ఇంటికి వెళ్లాలంటే బస్సుల్లో చార్జి చెల్లించి టికెట్ తీసుకునేవాళ్లం. లేకపోతే ప్రైవేట్ వాహనాల్లో వెళ్లేవాళ్లం. ఇప్పుడు ఉచితంగా పోతున్నాం. కాకపోతే బస్సుల సంఖ్య పెంచాలి.

–ఏ.భవాని, రాజాపేట

బస్సుల్లో వెళ్లాలంటేనే భయమేస్తుంది



ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచిదే. అయితే రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచకపోవడంతో ప్రయాణికులు కిక్కిరిసి వెళ్తున్నారు. ఫుట్‌బోర్డులో వేలాడుతూ ప్రయాణం సాగిస్తుండడంతో ఆందోళనగా ఉంది. తక్షణమే బస్సులు పెంచాలి. అలాగే బస్సులు రద్దు చేసిన గ్రామాలకు పునరుద్ధరించాలి.

–బేజాదికుమార్, భువనగిరి

నేడే రక్షాబంధన్



అన్నాచెల్లి, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ వేడుకకు వేళైంది. ఏటా శ్రావణ మాసం శుక్లపౌర్ణమి రోజు రాఖీ పండుగ జరుపుకోవడం ఆనవాయితీ. ఈ రోజు ఆడపడుచులు తమ సోదరులకు రాఖీలు కట్టి అనుబంధాలను చాటుకుంటారు. ఆడపడుచులు తమ పుట్టిళ్లకు చేరడం, కొనుగోళ్లతో రాఖీ సెంటర్లు, స్వీట్ షాపులు సందడిగా మారాయి. -భువనగిరి

బహుజనుల ఆశాజ్యోతి సర్వాయి పాపన్న

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే



సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్

భువనగిరిటౌన్ : బహుజనుల ఆశాజ్యోతి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని, బహుజనులను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు పాపన్న చేసిన పోరాటం ఆదర్శనీయమని కలెక్టర్ హనుంతు కే.జెండగే కొనియడారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వేడుకల్లో కలెక్టర్ పాల్గొన్నారు. పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదలు, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి సర్వాయి పాపన్నగౌడ్ అనేక పోరాటాలు చేశారని పేర్కొన్నారు. వారుచూపిన బాటలో పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. గీత కార్మికులకు సేఫ్టీ మోకులపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు యాదయ్య, శ్యాంసుందర్, డాక్టర్ కృష్ణ, బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కొలనుపాకలో పురాతన శిల్పం గుర్తింపు



ఆవుకు చికిత్స చేస్తున్న పశువైద్యుడి శిల్పాన్ని గుర్తించిన పరిశోధకుడు రత్నాకర్‌రెడ్డి

ఆలేరురూరల్ : పశువైద్యం ప్రాధాన్యతను తెలియజేసే పురాతన శిల్పాన్ని ఆలేరు మండలం కొలనుపాక సోమేశ్వరాలయం ఆవరణలో పురావస్తు పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి ఆదివారం గుర్తించారు. ఆలయంలో నంది మండపం వద్ద ద్వారానికి ఎడమవైపున వివిధ పురాతన శిల్పాలు చెక్కబడి ఉన్నాయి. ఇందులో పశువైద్యుడు పశువులకు చికిత్స చేస్తున్న శిల్పం ఉన్నట్లు రత్నాకర్‌రెడ్డి తెలిపారు. దీంతో పాటు ఆవు లేగ దూడకు పాలిస్తున్న శిల్పం కూడా మ్యూజియంలోని గోడపై చెక్కబడి ఉందన్నారు. నాటికాలంలో పాలకులు పశువైద్యులకు సముచిత స్థానం ప్రాధానం ఇవ్వడం, మూగజీవాల పట్ల జాలితో వ్యవహరించడం, పాడిపరిశ్రమ అభివృద్ధికి పాటు పడినట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తుందని పరిశోధకుడు పేర్కొన్నారు.

వాడుతున్న వరి

గుండాల : వానాకాలం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఒక్క భారీ వర్షం కురువలేదు. ఫలితంగా భూగర్భజలాలు అడుగంటాయి. బోర్లు, బావులు, చెరువుల్లో నీటి ఊటే లేదు. మరోవైపు ఎండలు మండుతుండడంతో వరి చేలు వాడుపడుతున్నాయి. రెండు, మూడు భారీ వర్షాలు కురిస్తే తప్పా.. వరి చేతికొచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

మాసాన్‌పల్లిలో నీరందని వరి చేను →



ప్రత్యేక పాలసీతోనే చేనేతకు పూర్వవైభవం

- చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాంతికుమార్



మాట్లాడుతున్న వనం శాంతికుమార్

మోత్కూరు : సంక్షోభంలో కూరుకుపోయిన చేనేత పరిశ్రమను ఆదుకోవడానికి, కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక పాలసీని రూపొందించాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోత్కూరులో ఆదివారం జరిగిన పద్మశాలి సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హెల్త్ ఇన్సూరెన్సుతో పాటు పలు సంక్షేమ పథకాలు, చేనేత సంక్షేమ బోర్డును కేంద్రం రద్దు చేసిందని ఆరోపించారు. నూలు, రంగులు, రసాయనాలు, చేనేత వస్త్రాలపై జీఎస్టీ విధించడంతో పరిశ్రమ పూర్తిగా నిర్వీర్యం అయ్యిందన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గత సర్కార్ ప్రవేశపెట్టిన చేనేతకు చేయూత, చేనేత మిత్ర, చేనేత బీమా పథకాలను అమలు చేయాలని, జియో ట్యాగ్ కలిగిన ప్రతి కుటుంబానికి నెలకు రూ.5వేలు ఇవ్వాలని కోరారు.. సమావేశంలో చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు, జిల్లా సహాయ కార్యదర్శి కూరపాటి రాములు, సభ్యుడు చంద్రయ్య పాల్గొన్నారు.

బోనమెత్తిన పల్లెలు



జిల్లా కేంద్రం భువనగిరితో పాటు పలు గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. శివసత్తులు, పోతరాజుల నృత్యాలు, డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లి ప్రదక్షిణలు చేశారు. గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సల్లంగ చూడాలని, పంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నారు.

వ్యర్థాల శుద్ధీకరణ ఏదీ?

- ఏడాదిన్నర క్రితం మోత్కూరులో ఎఫ్‌ఎస్‌టీ ప్లాంట్‌కు శంకుస్థాపన
- ఇప్పటికీ మొదలుకాని పనులు
- నిధులు విడుదల చేయని ప్రభుత్వం
- చేతులెత్తేసిన కాంట్రాక్ట్ సంస్థ
- నెరవేరని లక్ష్యం



ఎఫ్‌ఎస్‌టీ ప్లాంట్‌కు శంకుస్థాపన చేస్తున్న అప్పటి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ (ఫైల్)

మోత్కూరు : మానవ వ్యర్థాల శుద్ధీకరణ కలగానే మిగిలింది. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్‌యార్డులో ఫీకల్ స్లెడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎఫ్‌ఎస్‌టీ) నిర్మాణానికి ఏడాదిన్నర క్రితం శంకుస్థాపన చేశారు. నిధులలేమితో ఇప్పటి వరకు పనులు మొదలుకాలేదు. పట్టణాలను పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా కేంద్రం ప్రభుత్వం స్వచ్ఛభారత్ రెండో విడతలో భాగంగా మానవ వ్యర్థాల శుద్ధీకరణ ప్లాంట్‌లు మంజూరు చేసింది. వీటిని అందుబాటులోకి తీసుకురావడంతో పాటు నిర్వహణ బాధ్యతలను రాష్ట్రాలకు అప్పగించింది. ఈ మేరకు మోత్కూరులోని లూర్దునగర్ కాలనీ వెనుకవైపు సర్వే నంబర్ 947లో ఎకరం స్థలాన్ని ఎఫ్‌ఎస్‌టీ ప్లాంట్ నిర్మాణానికి కేటాయిస్తూ అప్పటి పాలకవర్గం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసింది. ప్లాంట్ నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వం స్టేట్ గ్రాంట్స్ నుంచి కోటి రూపాయలు కేటాయించింది. నిర్మాణ పనులకు 2023 మార్చి 31న అప్పటి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ప్లాంట్‌కు రూ.3.50 లక్షల వ్యయంతో మున్సిపాలిటీ విద్యుత్ సౌకర్యం కూడా కల్పించింది. టెండర్ ద్వారా పనులు దక్కించుకున్న హైదరాబాద్‌కు చెందిన ఎర్తింగ్ ప్రాజెక్టు సంస్థ.. మూడు నెలల్లో ప్లాంట్ నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. కానీ, నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్ట్ సంస్థ పనులు చేపట్టడం లేదు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

మానవ వ్యర్థాల శుద్ధి కేంద్రం పనులకు ఏడాదిన్నర క్రితం శంకుస్థాపన జరిగింది.నిర్దేశిత స్థలంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో విద్యుత్ సౌకర్యం కూడా కల్పించాం. ప్రభుత్వం మారడంతో నిధులు మంజూరు కాలేదు. దీంతో కాంట్రాక్ట్ సంస్థ పనులు చేపట్టడం లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లాం.

–శ్రీకాంత్, మోత్కూరు మున్సిపల్ కమిషనర్

వ్యర్థాలతో ఎరువులు తయారీ లక్ష్యం

పట్టణ పరిధిలోని సెప్టిక్ ట్యాంకుల్లోని వ్యర్థాలను ట్యాంకర్ల ద్వారా ప్లాంట్‌కు తరలించి ఎరువులు తయారీ చేయడం ఎఫ్‌ఎస్‌టీ లక్ష్యం. దీని నిర్మాణం కోసం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతి కూడా లభించింది. కాగా మున్సిపాలిటీలోని 12 వార్డుల పరిధిలో సుమారు 20 వేల జనాభా ఉంది. మానవ వ్యర్థాల శుద్ధి కేంద్రం ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ప్లాంట్ నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. దీంతో పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్ ఆసక్తి కనబరచడం లేదు. మానవ వ్యర్థాల ప్లాంట్ నిర్మాణంతో చెరువులు, కుంటలు, బిక్కేరుకు కలుషితం తప్పనుంది. ప్రధానంగా పర్యావరణ పరిరక్షణకు దోహద పడనుంది. వ్యర్థాల ద్వారా తయారైన ఎరువుతో మున్సిపాల్టీకి ఆదాయం సమకూరనుంది.

కిక్కిరిసిన దవాఖాన

రామన్నపేట : రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి రోగులతో కిటకిటలాడుతోంది. జ్వరం, వాంతులు, విరేచనాల బాధితులతో జనరల్ వార్డులు నిండిపోయాయి. ఓపీ 400కు పైగా నమోదవుతోంది. ఇన్‌పేషెంట్లు కూడా భారీగా ఉండడంతో బెడ్‌ల కొరత ఏర్పడింది. దీంతో ప్రసూతికోసం వచ్చిన మహిళలను మరోచోటకు తరలించి.. ఆ వార్డులో రోగులను సర్దుబాటు చేస్తున్నారు.





రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు, ఓపీ విభాగం వద్ద బారులుదీరిన రోగులు

క్లుప్తంగా

పిడుగుపాటుతో గొర్రెలకాపరి మృతి

దేవరకొండ: పిడుగుపాటుతో గొర్రెలకాపరి మృతి చెందిన సంఘటన దేవరకొండ మండల పరిధిలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రకు చెందిన సతీష్(45) గొర్ల కాపరిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం దేవరకొండ పట్టణ శివారులోని ముదిగొండ రోడ్డులో జీవాలను మేపుతుండగా ఒక్కసారిగా ఉరుములు, పిడుగుల శబ్దం రావడంతో పక్కనే ఉన్న చెట్టు వద్దకు వెళ్లాడు. చెట్టు మీద పిడుగుపడడంతో సతీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. కొందరు ఇది గమనించి పోలీసులకు సమాచారం అందించారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు



బాలిక కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

భువనగిరిటౌన్, మోటకొండూర్: మోటకొండూరు మండలం తేర్యాల గ్రామంలో ఆదివారం 17 ఏళ్ల బాలికకు ఆమె కుటుంబ సభ్యులు బాల్య వివాహం చేస్తుండగ యాదాద్రి జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది, పోలీసులు అడ్డుకున్నారు. ఏప్రిల్ నెలలో జనగామ జిల్లా బచ్చన్నపేటలో బాలిక వివాహం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో తేర్యాలలో బాలిక మేనమామ ఇంటి వద్ద వివాహం చేయడానికి ఆమె కుటుంబ సభ్యులు సిద్ధమయ్యారు. అధికారులు బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సఖి సెంటర్‌లో బాలికకు షెల్టర్ కల్పించారు. బాల్య వివాహాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని యాదాద్రి జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ బండారు జయశ్రీ అన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి పులుగుజ్జు సైదులు, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ మాటూరి దశరథ, చైల్డ్ లైన్ సూపర్‌వైజర్ బాలాంజలి, కౌన్సిలర్ స్వప్న, శ్రీకాంత్, హరిబాబు, స్కోప్ స్వచ్ఛంద సంస్థ సభ్యుడు సోమ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులో చోరీకి యత్నం

- దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగింత

కొండమల్లేపల్లి: బెల్టు షాపులో చోరీకి యత్నించిన దొంగను షాపు యజమాని తదితరులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. కొండమల్లేపల్లి మండలం చిన్నఅడిశర్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బుడ్డోనితండాకు చెందిన నేనావత్ కుమార్, అనిత దంపతులు పెండ్లిపాకలకు వెళ్లే రోడ్డు మార్గంలో చిన్న రేకుల షెడ్డు వేసుకుని బెల్టు షాపు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి దుకాణాన్ని మూసివేసి తండాకు వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో ఓ వ్యక్తి బెల్టు షాపులో దొంగతనం చేయడానికి ప్రయత్నిస్తుండగా సమీపంలో నివాసముంటున్న కదారి యాదయ్య అనే వ్యక్తి ఫోన్ ద్వారా కుమార్‌కు సమాచారం అందించాడు. దీంతో కుమార్ తన బావ వెంకటేష్‌తో పాటు కదారి యాదయ్య, అతడి కుమారుడు కలిసి షాపు వద్దకు చేరుకొని చోరీకి యత్నిస్తున్న వ్యక్తిని పట్టుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు దొంగను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేపట్టారు.

అనురాగ బంధం

రాఖీ పండుగ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల ఆత్మీయతకు ప్రతీక. జీవితాంతం తమకు రక్షణగా ఉండాలని తోబుట్టువులు తమ సోదరులకు రాఖీలు కడుతుంటారు. జీవితంలో ఎదురైన ఒడిదుడుకుల్లో సైతం తమతో రక్తం పంచుకున్న వారు అండగా నిలబడుతుంటారు. అటువంటి సోదర సోదరీమణులపై సోమవారం రక్షాబంధన్ సందర్భంగా ప్రత్యేక కథనం.



తమ్ముడు బిక్కునాయక్‌కు రాఖీ కడుతున్న సోదరి సత్తమ్మ (ఫైల్)

తమ్ముడికి కిడ్నీ దానం చేసిన అక్క

అర్వపల్లి : రెండు కిడ్నీలు చెడిపోయి ప్రాణాపాయ స్థితిలో ఉన్న తమ్ముడికి తన కిడ్నీని దానం చేసి రక్త సంబంధం విలువ తెలియజేసింది ఓ అక్క. జాజిరెడ్డిగూడెం మండలం సూర్యనాయక్‌తండా గ్రామ పంచాయతీ ఆవాసం వీర్యనాయక్‌తండాకు చెందిన కొమ్మాల మాజీ ఎంపీటీసీ సభ్యుడు బానోతు బిక్కు నాయక్(44)కు మూడేళ్ల కిందట రెండు కిడ్నీలు చెడిపోయాయి. 14 నెలల కిందట సూర్యాపేటలో ఉంటున్న తన అక్క నేతావత్ సత్తమ్మ తమ్ముడికి కిడ్నీని దానం చేసేందుకు ముందుకొచ్చింది. వెంటనే హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో బిక్కునాయక్‌కు అక్క సత్తమ్మ కిడ్నీని అమర్చి వైద్యులు అతడి ప్రాణం కాపాడారు. ప్రస్తుతం బిక్కునాయక్ గ్రామంలో వ్యవసాయంతో పాటు కర్ర వ్యాపారం చేస్తున్నారు. తమ్ముడి ప్రాణాలను కాపాడిన అక్క సత్తెమ్మను అప్పట్లో తండావాసులు అభినందించి సన్మానించారు.

ఆరోగ్యపరంగా ఇబ్బందని తెలిసినా..



తాను ఒక కిడ్నీని దానం ఇస్తే ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఎదురవుతాయని తెలిసినా నా తమ్ముడి ప్రాణం కోసం అవన్నీ లెక్క చేయలేదు. ఇప్పుడు నా తమ్ముడు ఆరోగ్యంగా ఉండటం నాకు ఎంతో సంతోషాన్ని ఇస్తుంది. ప్రతి ఏటా మా తండాకు వెళ్లి నా తమ్ముడికి రాఖీ కడతాను. ఈ సారి కూడా వెళ్లి రాఖీ కట్టి వస్తాను.

– నేతావత్ సత్తమ్మ, బిక్కునాయక్ సోదరి

అక్కే నా ప్రాణం కాపాడింది



నాకు ముగ్గురు అక్కలున్నారు. మూడో అక్క సత్తమ్మ సూర్యాపేటలో ఉంటుంది. నాకు కిడ్నీలు చెడిపోయి బతకనని డాక్టర్లు చెప్పి ఇంటికి పంపారు. అలాంటి సమయంలో మా అక్క సత్తమ్మ తన కిడ్నీ ఇచ్చి నా ప్రాణాలు కాపాడింది. ఎన్ని జన్మలు ఎత్తినా నా అక్కను మర్చిపోను. ప్రతిక్షణం నా అక్కను తలుచుకుంటున్నాను.

– బిక్కునాయక్

ఖండాంతరాలు దాటిన సోదర ప్రేమ



మందడి తేజశ్రీ



చెల్లెలు పంపిన రాఖీని చూపిస్తున్న కార్తీక్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): సృష్టిలో అన్నాచెల్లెలు, అక్కాతమ్ముడి అబంధం మధురమైనది. రాఖీ పండుగ రోజున సోదరులకు రాఖీ కట్టడానికి సోదరీమణులు ఎంతో దూరం నుంచి వస్తుంటారు. ప్రస్తుత ఆధునిక యుగంలో అందుబాటులో ఉన్న టెక్నాలజీని ఉపయోగించుకుని విదేశాల్లో ఉంటున్న సోదరులకు కూడా రాఖీలు పంపుతూ తమ సోదర ప్రేమను చాటుకుంటున్నారు సోదరీమణులు. నల్లగొండ పట్టణంలోని వివేకానంద కాలనీకి చెందిన మందడి తేజశ్రీ సోదరుడు మేరెడ్డి కార్తీక్‌రెడ్డి అమెరికాలోని డల్లాస్‌లో ఉంటున్నాడు. సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడిన సోదరుడికి గత 7 సంవత్సరాలుగా ప్రతి రాఖీ పండుగకు కొరియర్ ద్వారా ఆమె రాఖీని పంపిస్తూ అన్నపై ఉన్న ప్రేమను చాటుకుంటుంది.

సోదరుడి యాదిలో..



లింగయ్య విగ్రహానికి రాఖీ కడుతున్న అతడి సోదరీమణులు (ఫైల్)

రామన్నపేట: తమ తమ్ముడు మృతిచెంది పద్దెనిమిదేళ్లు అవుతున్నప్పటికీ ప్రతి యేటా రాఖీ పండగ రోజు అతడి విగ్రహానికి రాఖీ కడుతూ తమ ప్రేమను చాటుకుంటున్నారు అతడి సోదరీమణులు. రామన్నపేట మండలం శోభానాద్రిపురం గ్రామానికి చెందిన ఇంజమూరి లింగయ్య మోత్కూరు పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తూ 2006 ఆగస్టు 18న నక్సలైట్ల దాడిలో మృతిచెందాడు. అనంతరం శోభా నాద్రిపురం గ్రామ కూడలిలో లింగయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి అతడి సోదరీమణులు వర్కాల పార్వతమ్మ, బల్గూరి వసంత ప్రతి రాఖీ పండగకు లింగయ్య విగ్రహానికి రాఖీ కడుతూ తమ ప్రేమను చాటుతున్నారు.

నూలు పుట్టిన రోజుగా రాఖీ పండుగ



సామూహిక జంధ్యాలు ధరిస్తున్న పద్మశాలీలు (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి : రాఖీ పండుగంటే సాధారణంగా తమ సోదరులకు సోదరీమణులకు రాఖీలు కట్టి వేడుక చేసుకుంటారు. కానీ పోచంపల్లిలో మాత్రం పద్మశాలీలు వినూత్నంగా రాఖీ పండుగను నూలు పుట్టినరోజుగా జరుపుకుంటారు. పురాణాల్లో ఈ రోజున నూలు పుట్టిందని, నూలుతో తయారుచేసిన కంకణం కట్టుకొని చేపట్టే ప్రతి కార్యంలో అన్ని శుభాలు జరుగుతాయని పద్మశాలీల నమ్మకం. మార్కెట్లో ఎన్ని రకాల రాఖీలు వచ్చినా పద్మశాలీలు మాత్రం నూలుతో తయారు చేసిన కంకణాన్ని చేతికి కట్టుకోవడం ఆనవాయితీ.

గాయత్రి మాలధారణ..

ముందుగా శ్రీమార్కండేశ్వరస్వామి దేవాలయంలో గాయత్రి హోమం నిర్వహించిన తర్వాత పద్మశాలీలంతా సామూహికంగా నూలుతో తయారు చేసిన జంధ్యాలను ధరిస్తారు. అనంతరం పూజలు నిర్వహిస్తారు. అదేవిధంగా రాఖీపౌర్ణమి రోజున మగ్గం నేయడం మానేసి మాంసం, మద్యం సేవించకుండా ఎంతో నిష్టగా ఉంటారు. గతంలో చేనేత కళాకారుడైన చిలువేరు రామలింగం ఎడ్ల బండిపై మగ్గం నేస్తూ తమ ఆరాధ్య దైవమైన మద్దెలమ్మ దేవికి పట్టు చీరను సమర్పించారు. ఇదే ఆనవాయితీ 40 ఏళ్లుగా నిర్వహిస్తూ, బోనాలు సమర్పించేవారు. కానీ ఐదారు ఏళ్లుగా మానేశారు.

భవిష్యత్ తరాలకు అందిస్తున్నాం



పద్మశాలీలు రాఖీపౌర్ణమిని నూలు పుట్టినరోజుగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఈ రోజున ఎంతో నిష్టగా ఉండి నూలుతో తయారుచేసిన కంకణం, జంధ్యం ధరిస్తారు. గాయత్రి హోమం, మహాలక్ష్మికి విశేష పూజలు ఈ సంప్రదాయాన్ని భవిష్యత్ తరాలకు అందిస్తున్నాం.

– రుద్ర పాండురంగ శాస్త్రి, పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

సాగర్‌లో పర్యాటకుల సందడి



లాంచీ దిగివస్తున్న పర్యాటకులు



నాగార్జునకొండపై రెపరెపలాడుతున్న జెండా

నాగార్జునసాగర్: సాగర్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. రెండు గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తుండడంతో పర్యాటకులు ఆ దృశ్యాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో వచ్చారు. లాంచీల్లో నాగార్జునకొండకు వెళ్లి ప్రకృతి అందాలను తిలకించారు. ఎత్తిపోతల, బుద్ధవనం తదితర ప్రాంతాలు పర్యాటకులతో కిటకిటలాడాయి.

నాగార్జునకొండపై వంద అడుగుల జాతీయ జెండా

సాగర్ జలాశయం మధ్యలో గల ఐలాండ్ మ్యూజియంలో 100అడుగుల జాతీయ జెండాను ఏర్పాటు చేశారు. లాంచీలలో నాగార్జునకొండకు వెళ్లే పర్యాటకులను ఈ జెండా ఎంతగానో ఆకట్టుకుంటుంది.

మామ మందలించడంతో మహిళ ఆత్మహత్య

భువనగిరి క్రైం: మామ మందలించడంతో క్షణికావేశంలో ఉరేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన భువనగిరి మండలం వడాయిగూడెంలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా వెంసూర్ మండలం శంభునిగూడెం గ్రామానికి చెందిన ముదునూరి సతీష్‌రాజ్, భార్గవి (25) దంపతులు కుటుంబ సమేతంగా వడాయిగూడెం వచ్చి నివాసం ఉంటున్నారు. శనివారం కుమారుడు అన్నం తినకపోవడంతో భార్గవి చేయి చేసుకుంది. దీంతో పక్కనే ఉన్న మామ సత్యనారాయణ బాబును ఎందుకు కొడుతున్నావని కోడలిని మందలించడంతో క్షణికావేశంలో ఆమె ఇంట్లోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆమెను 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందింది. ఆదివారం మృతురాలి తండ్రి కపిలవాయి శ్రీనివాస్‌రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

స్కూటీని ఢీకొన్న గుర్తుతెలియని వాహనం

- ఒకరు మృతి, మరొకరికి తీవ్రగాయాలు



సంజయ్ (ఫైల్)

పెద్దవూర: స్కూటీని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం రాత్రి పెద్దవూర మండల పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని బహదూర్‌పురాకు చెందిన మునిగల సంజయ్(19), అతడి స్నేహితుడు గాథ సందీప్ నాగార్జునసాగర్ ప్రాజెక్టును చూసేందుకు శనివారం ఉదయం హైదరాబాద్ నుంచి స్కూటీపై వచ్చారు. సాయంత్రం తిరిగి హైదరాబాద్‌కు వెళ్తుండగా రాత్రి 7.15 గంటల సమయంలో పెద్దవూర మండలం పొట్టివానితండా గ్రామ స్టేజీ దాటగానే పెద్దవూర నుంచి నాగార్జునసాగర్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వీరి స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సంజయ్, సందీప్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మునిగల సంజయ్ ఆదివారం ఉదయం మృతిచెందాడు. మృతుడు హైదరాబాద్‌లోని అవంతి కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మృతుడి మేనమామ మాడిశెట్టి నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పీ. వీరబాబు తెలిపారు.

టిప్పర్ ఢీకొని యువకుడి దుర్మరణం



సురేష్ (ఫైల్)

మునగాల(కోదాడ): బైక్‌పై వెళ్తున్న యువకుడిని టిప్పర్ ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం మునగాల మండలం మాధవరం గ్రామ శివారులో జరిగింది. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మునగాల మండలం నేలమర్రి గ్రామానికి చెందిన రాంపంగు వెంకన్న, మైసమ్మ దంపతుల రెండో కుమారుడు సురేష్(32) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ప్రస్తుతం మండలంలోని నర్సింహులగూడెంలో ఉంటూ పనులు చేస్తున్నాడు. నేలమర్రి గ్రామంలో ముత్యాలమ్మ పండుగతో పాటు రాఖీ పండుగ ఉండడంతో రెండు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. ఎలక్ట్రీషియన్‌గా పనిచేసినందుకు గాను డబ్బులు తీసుకునేందుకు ఆదివారం బైక్‌పై నేలమర్రి నుంచి సూర్యాపేటకు బయల్దేరాడు. మార్గమధ్యలో మాధవరం గ్రామ శివారులో మట్టిలోడుతో వెళ్తున్న టిప్పర్‌ను డ్రైవర్ అజాగ్రత్తగా నడిపి సురేష్ బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సురేష్ టిప్పర్ టైర్ల కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు అవివాహితుడు. మృతుడి సోదరుడు రాంపంగు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహానికి కోదాడ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధుడు మృతి



గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం

పెద్దవూర: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూర మండలం కొత్తగూడెం గ్రామ శివారులోని బస్టాప్ పక్కన ఈ నెల 8వ తేదీన గుర్తుతెలియని వృద్ధుడు పడి ఉన్నాడని పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించగా.. అతడి ఆరోగ్యం క్షీణించడంతో నాగార్జునసాగర్‌లోని కమలా నెహ్రూ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ఈ నెల 17వ తేదీన మృతి చెందాడు. అతడు గత రెండేళ్లుగా కొత్తగూడెం పరిసర గ్రామాల్లో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడని స్థానికులు తెలిపారు. మృతిచెందిన వృద్ధుడి మృతదేహాన్ని నల్లగొండ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చామని, అతడి వివరాలు తెలిసిన వారు 8712670198 గాని, 9700125494 నంబర్లను సంప్రదించాలని ఎస్‌ఐ పి. వీరబాబు సూచించారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరు యువకులు మృతి



సుదర్శన్ (ఫైల్)



విజయ్‌కుమార్ (ఫైల్)

కోదాడరూరల్: రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు యువకులు మృతిచెందాడు. ఈ ఘటన కోదాడ మండలం కాపుగల్లు క్రాస్‌రోడ్ వద్ద శనివారం రాత్రి జరిగింది. కోదాడ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలం తొగర్రాయికి చెందిన కొలకొండ సుదర్శన్(27) తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. సుదర్శన్ శనివారం కోదాడలోని తన అన్న ఇంటికి వచ్చి తిరిగి రాత్రి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. అదే సమయంలో మేళ్లచెర్వుకు చెందిన మంగళంపల్లి విజయ్‌కుమార్(23) హైదరాబాద్ నుంచి వస్తున్న తన స్నేహితుడిని తీసుకెళ్లేందుకు బైక్‌పై కోదాడకు వస్తున్నాడు. ఈ క్రమంలో కాపుగల్లు క్రాస్‌రోడ్ వద్ద సుదర్శన్ అతివేగంగా వచ్చి విజయ్ బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో విజయ్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందగా.. తీవ్ర గాయాలపాలైన సుదర్శన్‌ను కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మృతిచెందాడు. ఇరువురి మృతదేహాలకు కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతులిద్దరూ అవివాహితులు. మృతుడు విజయ్‌కుమార్ బాబాయి మరియదాసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

పెట్రోల్ పోసుకుని కాంగ్రెస్ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

- పార్టీలో తనకు ప్రాధాన్యం ఇవ్వడంలేదని మనస్తాపం



భగవాన్‌నాయక్

మిర్యాలగూడ అర్బన్: పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు ఎంతగానో కష్టపడిన తనను పట్టించుకోవడం లేదని మనస్తాపంతో కాంగ్రెస్ కార్యకర్త పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో శనివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరమ్మకాలనీలో నివాసముంటున్న తేజావత్ భగవాన్ నాయక్(42) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాంగ్రెస్ పార్టీలో కీలకంగా పనిచేస్తూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం ఎంతో కృషిచేశాడు. ఆదివారం బోనాల పండుగ సందర్భంగా ఇందిరమ్మకాలనీలో ముత్యాలమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో తన ఫొటో పెట్టకుండా అవమానించారని ఆవేదన చెందిన భగవాన్ నాయక్ ఇటీవల పార్టీలోకి వచ్చిన వారికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని, మొదటి నుంచి పనిచేసిన తనను పట్టించుకోవడంలేదని మనస్తాపంతో పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. భగవాన్‌నాయక్ శరీరం కాలిపోవడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. భగవాన్‌నాయక్‌కు భార్య మంజులత, ఇద్దరు కుమార్తెలున్నారు. తన భర్తకు మెరుగైన వైద్యం అందించేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ముందుకురావాలని అతడి భార్య ప్రాధేయపడింది.

మూర్ఛతో వ్యక్తి మృతి



మనోహర్ (ఫైల్)

గుండాల: నిద్రలో మూర్ఛ వచ్చి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గుండాల మండలం నూనెగూడెం గ్రామంలో ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నూనెగూడెం గ్రామానికి చెందిన తూనం మనోహర్(36) తాగుడుకు బానిసై జులాయిగా తిరుగుతూ భార్యను వేధించేవాడు. దీంతో ఆమె తన మూడేళ్ల క్రితం జనగామ జిల్లా బచ్చన్నపేటలోని తన తల్లిగారింటికి వెళ్లింది. అప్పటి నుండి మనోహర్ ఒంటరిగా ఉంటున్నాడు. ఈ నెల 16వ తేదీ రాత్రి మనోహర్ మద్యం తాగి ఇంట్లో నిద్రిస్తుండగా నిద్రలోనే మూర్ఛ వచ్చి మృతిచెందాడు. ఆదివారం ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండగా చుట్టుపక్కల వారు పోలీసులకు, అతడి భార్యకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సౌజన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జి. సైదులు తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నాడు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

- వైన్స్ ఎదుట యువకుడిని బీరు సీసాతో పొడిచిన మరో యువకుడు
- పార్కింగ్ చేసిన బైక్‌ను తీసే క్రమంలో ఘర్షణ

సూర్యాపేటటౌన్: మద్యం మత్తులో వైన్స్ ఎదుట యువకులు వీరంగం సృష్టించారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆదివారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండలం అనంతారం గ్రామానికి చెందిన మచ్చ సౌభాగ్య కుమారుడు మచ్చ సాయిశరత్ తన స్నేహితులతో కలిసి ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో బంధువుల పెళ్లికి వచ్చాడు. వారు ఫంక్షన్‌హాల్ నుంచి రాజీవ్ పార్కు సమీపంలో జాతీయ రహదారి వెంట ఉన్న సెవెన్ లిక్కర్ మార్ట్‌లో మద్యం కొనుగోలు చేసేందుకు బైక్ పార్కింగ్ చేసి వెళ్లారు. అదే సమయంలో సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన పరశనబోయిన సైదులు, బోయిన సాయి, ఉదయ్, ఈశ్వర్ అదే వైన్స్‌లోకి మద్యం తాగేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ఇరువురు ఒకేసారి బయటకు వస్తుండగా బైక్‌ను పార్కింగ్ నుంచి తీసే క్రమంలో తమకు తగిలిందని ఒకరిపై ఒకరు దుర్భాషలాడుకుంటూ ఇరువర్గాలు ఘర్షణకు దిగారు. ఇంతలో ఓ యువకుడు మచ్చ సాయిశరత్‌ను బీరు సీసాతో వీపు వెనకాల బలంగా పొడిచాడు. దీంతో అతడి వీపు రెండు భాగాలుగా చీలిపోయింది. అక్కడే ఉన్న సాయిశరత్ స్నేహితులు మరో వర్గం యువకులపై దాడి చేసి సాయిశరత్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. సాయిశరత్ తల్లి సౌభాగ్య తమ కుమారుడిని ఈశ్వర్ అనే వ్యక్తి పొడిచాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అదేవిధంగా తమపై సాయిశరత్, అతని స్నేహితులు అకారణంగా రాళ్లతో దాడి చేశారని పరశనబోయిన సైదులు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రెండు కలప లారీల పట్టివేత

చౌటుప్పల్: అనుమతులు లేకుండా అక్రమంగా కలపను తరలిస్తున్న రెండు లారీలను శనివారం రాత్రి అటవీశాఖ అధికారులు చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో పట్టుకున్నారు. పట్టుబడిన లారీలను స్థానిక అటవీ కార్యాలయానికి తరలించామని ఫారెస్ట్ రేంజ్ అధికారి సతీష్‌బాబు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి

పాలకవీడు: విద్యుదాఘాతంతో యువ రైతు మృతి చెందాడు. ఈ ఘటన పాలకవీడు మండలం బెట్టెతండా గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బెట్టెతండా గ్రామానికి చెందిన బండావత్ సైదులు(30) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం తన పొలం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బ్రేక్‌డౌన్ కావడంతో బ్రేకర్ ఆన్ చేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. దగ్గరలో ఉన్న రైతులు గమనించి గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం అందించారు. మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చిత్రం.. మధుర జ్ఞాపకం

ఒక్క చిత్రం ఎన్నో భావాలను స్ఫురింపజేస్తుంది. ఊహకందని భావాలను వర్ణాలను ప్రతి బింబింపజేస్తుంది. సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా సాక్షి కెమెరాకు చిక్కిన కొన్ని మరపురాని చిత్రాలు.





- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ





- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట